పార్కింగ్ తిప్పలు.. ఇంకెన్నాళ్లు?

- ఇరుకురోడ్లతో ఇబ్బంది
- స్థలం కేటాయించాలని వాహనదారుల వినతి
- పట్టించుకోని అధికారులు


సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారిలో వాహనాల పార్కింగ్

సుల్తానాబాద్: మండల కేంద్రంతో పాటు మున్సిపల్ పాత తాలూకా కేంద్రంలో పార్కింగ్ స్థలాలు లేవు. పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పనుల నిమిత్తం గ్రామాల నుంచి వచ్చేవారు వాహనాలు నిలపడానికి ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు డ్రైనేజీలను ఆక్రమించుకొంటున్నారు. ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో పార్కింగ్‌కు స్థలం లేకుండా పోతోంది.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..
పట్టణంలో కొత్తగా భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మించే వారు సెట్ బ్యాక్, వాహనాల పార్కింగ్ గురించి పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు సైతం నిబంధనలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పూసాల రోడ్డు, స్వప్న కాలనీ, గణేశ్‌నగర్, జవహర్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో రెండు నుంచి మూడు అంతస్తుల భవనాలు నిర్మించినా ఏ ఒక్కరూ పార్కింగ్ స్థలాలు వదలలేదు. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు సైతం ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారు. రహదారులపై తోపుడు బండ్ల మీద వ్యాపారాలు కొనసాగుతుండడంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. సుల్తానాబాద్‌లోని పోలీస్‌స్టేషన్ రోడ్డు, మున్సిపాలిటీ ముందు భాగం, నెహ్రూ విగ్రహం, శ్రీరాంపూర్ రోడ్డు, పూసాల రోడ్డు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. సోమవారం కూరగాయల సంత అంగడితో జనాలు ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తున్నాం



ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నాం. సోమవారం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం గస్తీ తిరుగుతారు. ప్రధాన మార్గాల్లో తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారిని రోడ్లపై నిలపొద్దని సూచిస్తున్నాం. ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తున్నాం. – విజేందర్, ఎస్సై, సుల్తానాబాద్

కూరగాయల సంత షిఫ్ట్ చేస్తాం



కూరగాయల మార్కెట్ 779 సర్వే నంబర్‌లో నిర్మాణం జరుగుతోంది. నిర్మాణం పూర్తయిన వెంటనే కూరగాయల సంతను అక్కడికే షిఫ్ట్ చేస్తాం. ట్రాఫిక్ సమస్య రాకుండా ఇప్పటికే పోలీస్‌శాఖ, మున్సిపల్ సిబ్బందితో చర్యలు తీసుకుంటున్నాం. – ముత్యం సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్

ఒక్కరోజైనా సైకిల్ తొక్కండి


సైకిల్ తొక్కుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

కోల్‌సిటీ: కాలుష్య నియంత్రణకు, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిరోజూ సైకిల్ తొక్కాలని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రామగుండం లయన్స్ క్లబ్, మగువ, స్ఫూర్తి, శతాబ్ది లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా గురువారం ఉద్గార రహిత దినం, అంతర్జాతీయ శాంతి ర్యాలీని గోదావరిఖనిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శాంతి ర్యాలీతోపాటు సైక్లింగ్‌ను ప్రారంభించారు. ర్యాలీలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతి, మనీషా అగర్వాల్, డాక్టర్ లక్ష్మీవాణి, గాలి సునీత, శశికళ, ఎస్.గోపాలరావు, కె.ముకుందరెడ్డి, బంక రామస్వామి, తానిపర్తి గోపాల్‌రావు, తిలక్‌చక్రవర్తి, చంద్రమౌళి పాల్గొన్నారు.

భూకబ్జాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు
గోదావరిఖని: భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని గోదావరిఖని ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. పేద, మధ్య తరగతికి చెందినవారు తమ గృహ, వ్యక్తిగత అవసరాలకు భూములు కొనుగోలు చేస్తున్న సందర్భంలో ఎవరైనా ముఠాగా ఏర్పడి బెదిరింపులకు పాల్పడితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్

గోదావరిఖనిటౌన్: పోస్టాఫీసుల్లో కల్పిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. గోదావరిఖనిలోని ఉప తపాలా కార్యాలయంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేవలం రూ.399తో రూ.10లక్షల ప్రమాద బీమా అందజేయడం గొప్ప విషయమన్నారు. పెద్దపల్లి తపాలాశాఖ అధికారి పి.ప్రభాకర్, సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాస్, ఎస్పీఎంలు వేణుగోపాల్, చిరంజీవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం


ప్రచారం చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్యారంటీ కార్డులపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నిరుపేదలకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో పథకాలను రూపొందించి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, చిలుక సతీశ్, కాల్వల శ్రీనివాస్, దన్నమనేని ఆనందరావు, సతీశ్‌రావు, వీరగోని శేఖర్‌గౌడ్, మల్లయ్య ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు ఇవే ఆఖరి ఎన్నికలు
పెద్దపల్లిరూరల్: ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోకుండా కేవలం ప్రజాధనాన్ని, సహజ సంపదలను దోచుకోవడంపైనే పాలకులు దృష్టిసారించారని, బీఆర్‌ఎస్, బీజేపీలకు ఇవే ఆఖరి ఎన్నికలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం గోపయ్యపల్లిలో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్, సర్వర్‌పాషా, ఎడెల్లి శంకర్, స్వామి, రాజయ్య, శ్రావణ్, నర్సయ్య, అమర్, లక్ష్మణ్, రవి, రాకేశ్, శ్రీనివాస్, రియాజ్, సాజిద్, హరికృష్ణ ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న నందిని

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ కూతురు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు కొప్పుల నందిని కోరారు. ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో గురువారం మండల యువజన, విద్యార్థి విభాగం, సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం కృషి చేయాలని ఆమె కోరారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు మంద శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథ్

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ బాగుంటుందని గురుకుల ప్రిన్సిపాల్ రఘునాథ్ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జోనల్, రాష్ట్రస్థాయిలో ఎంపికైన సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. అండర్–17 కబడ్డీలో అజయ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో మహేశ్, వాలీబాల్‌లో సిద్దార్థ, అండర్–17 బాలికల విభాగం వాలీబాల్‌లో హన్సిక, ఖోఖోలో అక్షిత, అండర్–14 బాలుర కబడ్డీలో సాయికిరణ్, వాలీబాల్‌లో సాయిచరణ్, బాలికల విభాగంలో కబడ్డీలో శ్రీనిధి, రామగుండంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్–14లో లాంగ్‌జంప్‌లో సాత్విక్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి ఉన్నారు.

ముప్పిరితోటలో విజృంభిస్తున్న జ్వరాలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో వైరల్ ఫీవర్‌తో పాటు విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామానికి చెందిన కెక్కర్ల జితేందర్(19)అనే యువకుడు విషజ్వరంతో నాలుగు రోజులుగా బాధపడుతూ ప్లేట్‌లెట్స్ తగ్గి కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన పలువురు జ్వరంతో కరీంనగర్, పెద్దపల్లి పట్టణాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు జ్వరంతో బాధపడుతూ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని మెడిసిన్ వాడుతున్నారు.

పారిశుధ్య నిర్వహణ లోపమా?
వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణ లోపంతోనే దోమలు విజృంభించి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, పారిశుధ్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అప్రమత్తమైన వైద్యసిబ్బంది
ముప్పిరితోటలో విషజ్వరంతో గ్రామానికి చెందిన కెక్కర్ల జితేందర్ అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో అప్రమత్తమైన విద్యసిబ్బంది గ్రామంలో గురువారం జీపీ కార్యాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్యశిబిరంలో 82మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 10మంది జ్వరంతో భాదపడతున్నవారిని గుర్తించి రక్తనమూనాలను తీసుకున్నారు. మరో 27మంది నుండి కూడా రక్తనమూనాలను తీసుకుని పరీక్షలకు పంపించారు. ఈవైద్యశిబిరం శుక్ర, శని వారాలు కొనసాగుతందని డాక్టర్ శ్రాశణి తెలిపారు. వైద్యశిబిరంను డీఎంవో డాక్టర్ రాజమౌళి, డిస్ట్రిక్ట్ సబ్‌యూనిట్ ఆఫీసర్ ఉమాపతి, లక్ష్మన్, నాగమణి, రాజేశ్వరిదేవి, విజయేందర్‌రాజు పరిశీలిచారు.

రైలుపట్టాల మరమ్మతుకు శ్రీకారం


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఓదెల: కాజీపేట్– బల్లార్షా సెక్షన్ల మధ్యలో ప్రమాదాల నివారణలో భాగంగా రైలుపట్టాల మరమ్మతుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. మూడోరైలు మార్గం పూర్తయి రైళ్ల రాకపోకల రద్దీ పెరగటంతో శాఖ అప్రమత్తం అయింది. కాజీపేట్ నుంచి జమ్మికుంట, బిజిగిరిషరిఫ్, పొత్కపల్లి, ఓదెల, పెద్దపల్లి, మంచిర్యాల రైల్వేస్టేషన్ల మధ్యలో అప్ అండ్ డౌన్ మరమ్మతులు జోరందుకున్నాయి. ప్రస్తుతం వేసవిని తలపిస్తున్న ఎండలు, ఎడతెరిపిలేని ముసుర్లతో రైలుపట్టాల సంకోచ, వ్యాకోచాలతో ప్రమాదాలు జరుగుతాయని మరమ్మతులు చేస్తున్నట్లు సమాచారం. అండర్‌బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రత్యేక నిఘాతో రక్షణ చర్యలు చేపడుతున్నారు. గులాయ్ ప్రదేశాల్లో పట్టాల మధ్యలో చెత్త చెదారం తొలగిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ ఫలాలు


ప్రొసీడింగ్ అందజేస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

రామగిరి: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని నాగెపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులకు గురువారం జెడ్పీచైర్మన్ చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. సర్పంచ్ కొండవేన ఓదెలు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గద్దల శంకర్, ఉపసర్పంచ్ చిట్టంపల్లి అనిల్, ఆలయ కమిటీ చైర్మన్ ఏగోలపు శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత
ముత్తారం: మండలం కేశనపల్లికి చెందిన మంథని రాజేందర్ అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా గురువారం స్థానిక సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్ రూ.15వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. నాయకులు రాంగ్ల పోచమల్లు, తాత బాలు, గాజుల శ్రీనివాస్, చుంచు రమేశ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నబొంకూర్, మియాపూర్ గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సర్పంచ్‌లు రాజు, స్వప్న, ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ ఫక్కీర్‌యాదవ్ ఉన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మహిళా సంఘాల సభ్యులతో తడి, పొడి చెత్త, పారిశుధ్య నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, సర్పంచ్ నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. సెగ్రిగేషన్ షెడ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతాహీ సేవా–2023 కార్యక్రమాన్ని ఎంపీడీఓ భూక్య యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి కృష్ణ, ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ హాజరయ్యారు.

జిల్లా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సత్యప్రసాద్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ గురుకుల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ రాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు.

108 నైవేద్యాలు



యైటింక్లయిన్‌కాలనీ: వినాయక నవరాత్రులను పురస్కరించుకొని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ బంగ్లాస్ ఏరియాలో ఏర్పాటు చేసిన మట్టి గణనాథునికి గురువారం 108 నైవేద్యాలు సమర్పించారు. ఆర్జీ–2 ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

✦ **వినాయకుల వద్ద డీజేలు పెట్టొద్దు**
సుల్తానాబాద్‌రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో, నిమజ్జన ఊరేగింపులో డీజేలు పెడితే చట్టరీత్యా తీసుకోవడంతో పాటు డీజేలు సీజ్ చేయనున్నట్లు ఎస్సై విజేందర్ అన్నారు. మండలంలోని డీజే నిర్వాహకులకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

✦ **13 మంది బైండోవర్**
ఓదెల: మండలంలోని ఆయా గ్రామాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా బెల్టుషాపులు నడుపుతున్న 13 మందిని తహసీల్ కార్యాలయంలో గురువారం బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ యాకన్న పేర్కొన్నారు. మళ్లీ షాపులు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

✦ **మద్యం మత్తులో ప్రయాణికుడి హంగామా**
రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో హంగామా చేశాడు. అతడి వద్ద ఉన్న రూ.500 నోట్లు పలువురికి పంచిపెట్టడం గమనార్హం. సదరు వ్యక్తి మద్యం మత్తులో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కింద పడుకోగా అతడి నుంచి రూ.500 నోట్లు కిందపడ్డాయి. దీనిని గుర్తించి రైల్వేస్టేషన్ ఆటో యూనియన్ ప్రతినిధి ఎండీ.రహీం రామగుండం ఎస్సై వెంకటేక్‌కు సమాచారం అందించడంతో సిబ్బందిని పంపించారు. ప్రయాణికుడి మత్తు దిగిపోయే వరకు కాపలా ఉండి భోజనం చేయించారు. అతడి వద్ద ఉన్న రూ.9 వేలు భద్రంగా ఉంచుకోవాలని పేర్కొంటూ, ఎక్కడికి వెళ్లాలని హిందీలో ప్రశ్నించినా సదరు వ్యక్తి మాట్లాడే భాష స్థానికులకు అర్థం కాలేదు. ఢిల్లీ జానా అంటూ పేర్కొనడంతో ఢిల్లీ వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్ ఎక్కించారు.

✦ **ఆయుష్మాన్‌భవ విజయవంతం చేయాలి**
సుల్తానాబాద్: ప్రజలకు ఉచిత ఆరోగ్యమేళా ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి మాట్లాడారు. ఈ నెల 22న సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య మేళా నిర్వహించబడునని, ప్రజలకు రక్త పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలకు అవసరం ఉన్న వారిని గుర్తించి జిల్లా ఆసుపత్రికి సిఫార్సు చేస్తారని పేర్కొన్నారు. మేళాలో ప్రజలు, రోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

✦ **ఆటల పోటీలు**
జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండల స్థాయి ఆటలపోటీలు రెండోరోజు కొనసాగాయి. మండల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల నుంచి వచ్చిన అండర్–14 బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించారు. పీఈటీలు సురేశ్, శ్రీవాణి ఉన్నారు.

✦ **నేడు ఐటీఐలో సీట్ల భర్తీకి చివరి తేదీ**
రామగుండం: రామగుండం ఐటీఐలోని వివిధ ట్రేడ్లలో సీట్లు మాత్రం భర్తీకి శుక్రవారంతో గడువు ముగియనుందని ప్రిన్సిపాల్ సురేందర్ పేర్కొన్నారు. విద్యార్థులు శుక్రవారం సాయంత్రం 5గంటలలోగా ధృవీకరణ పత్రాలతో కళాశాలకు రావాలని పేర్కొన్నారు.

✦ **పోస్టర్ ఆవిష్కరణ**
కమాన్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారంటీ కార్డు పోస్టర్‌ను గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

✦ **కొండాలక్ష్మణ్ బాపూజీ వర్ధంతి**
యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్/గోదావరిఖని టౌన్/ఓదెల/రామగిరి/ఎలిగేడు: జిల్లావ్యాప్తంగా మంథని, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో గురువారం కొండాలక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

✦ **నిరుద్యోగులను మోసం చేస్తున్న కేసీఆర్**
యైటింక్లయిన్‌కాలనీ: సీఎం కేసీఆర్ నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటికీ ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య ఆరోపించారు. గురువారం రామగిరి మండలం ముస్త్యాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రామగిరి మండల నూతన కమిటీని ప్రకటించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నవీన్, పవన్, రాజశేఖర్, పాతం నవీన్, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

✦ **పథకాల అమలులో అన్యాయం**
కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకం అమలులో మండల ప్రజలకు జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్యాయం చేస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు బాద్రపు శంకర్, అప్సర్, ఇక్బాల్, రాజు, శేఖర్, గట్టయ్య, శ్రీనివాస్, మతీన్, రఫీక్, రవి, సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

✦ **హామీలు అమలు చేయాలి**
రామగుండం: పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని కోరుతూ గురువారం మండల పరిషత్ సూపరింటెండెంట్ కరుణాకర్‌కు జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అడారి నర్సింగరావు, కొండపాక కరుణాకర్, తమ్మనవేని శంకర్ తదితరులున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు


మాట్లాడుతున్న దాసరి ఉష

ఓదెల: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని నాంసానిపల్లె, అబ్బిడిపల్లె, లంబాడితండాలో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లేస్తే కూలీలుగా మారాల్సిందేనన్నారు. ఆయా గ్రామాల్లో బీఎస్పీ జెండాలను ఆవిష్కరించారు. బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్నగౌడ్, పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి ఎండీ రియాజ్, మండల మహిళా కన్వీనర్ శోభ, నాయకులు మహేశ్, నవీన్, సాత్తూరి రాజేశం, బేరం రవి, బోయ సది, జిక్కిరి సంపత్, ముదిరాజ్ డైరెక్టర్ క్రాంతికుమార్, కోమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం


కబడ్డీ ఆడుతున్న చైర్‌పర్సన్ శైలజ

మంథని: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జోనల్ స్థాయి క్రీడలను గురువారం జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల నుంచి 14, 17ఏళ్లలోపు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో తలపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్, జెడ్పీ చైర్‌పర్సన్ కబడ్డీ ఆడారు. ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, ఎంఈవో దాసరి లక్ష్మి, క్రీడల కన్వీనర్ మాధవి పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్‌లో జరిగే గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మండల పరిధిలోనే కాకుండా పెద్దపల్లి, రామగిరి మండలాల పరిధిల నుంచి భారీ ఎత్తున విగ్రహాలను తీసుకువచ్చి రిజర్వాయర్‌లో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు, తహసీల్దార్ వంగల మోహన్‌రెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉపసర్పంచ్ రాసకొండ చంద్రమౌళి, ఆర్ఐ సంధాని ఉన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 6నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షురాలు తోడేటి లావణ్య, లీలావతి, రత్నమాల, లక్ష్మి, శారద, విజయ, సాయి శృతి, రజిత, లింగయ్య, గుర్రం సాయి, మొండయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం


సన్మానిస్తున్న ఉపసర్పంచ్ నాగరాజు

ఓదెల: మండలంలోని హరిపురంలో పనిచేసి బదిలీ అయిన కార్యదర్శి శ్రీనివాస్‌ను గ్రామస్తుల సమక్షంలో ఉపసర్పంచు గ్యారవేని నాగరాజు గురువారం సన్మానించారు. ప్రస్తుతం హరిపురం కార్యదర్శిని లంబాడితండాకు బదిలీ కాగా, అంతర్గాం మండలం రాయదండిలో కార్యదర్శిగా పనిచేసిన శంకర్‌ను హరిపురం గ్రామానికి బదిలీ చేశారు.

పొగాకు ఉత్పత్తులు వాడొద్దు

సుల్తానాబాద్: పొగాకు ఉత్పత్తులు వాడొద్దని పూసాల పల్లె దవాఖానా డాక్టర్ శ్రీజ అన్నారు. గురువారం ప్రభుత్వ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల వినియోగంతో అవయవాలు దెబ్బతినే విధానంపై అవగాహన కల్పించారు.

ఉత్తమ డాక్టర్‌కు సత్కారం

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఉత్తమ డాక్టర్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ టీ.వీ.రాజశేఖర్‌రెడ్డిని గురువారం రామగుండం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గట్ల కుమార్, ప్రధాన కార్యదర్శి లంక సదయ్య, కోశాధికారి తిరుపతి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రదీప్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కమాన్‌పూర్: మండల కేంద్రంలో చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమ్మె రెండోరోజు కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల నుంచి వంటలు చేయకుండా సమ్మెబాట పట్టారు.